క్లుప్తంగా

గుండెపోటుతో మాజీ జెడ్పీటీసీ మృతి


మేడా సుబ్బారావు (ఫైల్)

కొత్తపట్నం: మండల మాజీ జెడ్పీటీసీ మేడా సుబ్బారావు గుండె పోటుతో మృతిచెందారు. ఆదివారం మధ్యాహ్నం కొత్తపట్నం పోలేరమ్మ అలయంలో జరిగిన విందుకు వెళ్లి వచ్చారు. ఇంటి దగ్గర ఉండగా, సాయంత్రం గుండెనొప్పి రావడంతో కుప్పకూలిపోయారు. భార్య సరస్వతి, కుమారుడు సురేష్ హుటాహుటిన ఒంగోలులోని హాస్పిటల్‌కు ఆటోలో తరలించారు. అప్పటికే ఆయన మృతి చెందినట్లు డాక్టర్లు తెలిపారు. చిన్న వయసు నుంచే సీపీఐ పార్టీలో సుబ్బారావు కొనసాగారు. సారాయి ఉద్యమంలో పాల్గొని కీలకపాత్ర పోషించారు. ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లి పేద ప్రజల సమస్యలు పరిష్కరించేవారు. సీపీఐ పార్టీ మద్దతుతోనే జెడ్పీటీసీ సభ్యునిగా పోటీచేసి గెలుపొందారు. కొత్తపట్నం హైస్కూల్‌కు చైర్మన్‌గా ఏకగ్రీవంగా ఎన్నికై మంచి పనితీరుతో పేరు తెచ్చుకున్నారు. విద్యార్థులకు సొంత నిధులతో విద్యా సామగ్రి అందించారు. కొత్తపట్నం హైస్కూల్లో రాత్రివేళ ట్యూషన్ ప్రారంభించి విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేందుకు కృష చేశారు. నల్లవాగు బ్రిడ్జి, బకింగ్‌హాం బ్రిడ్జి, వాల్కామ బ్రిడ్జి నిర్మించాలని డిమాండ్ చేస్తూ బ్రిడ్జి వద్దే టెంట్ వేసి ఆమరణ నిరాహారదీక్ష చేశారు. అయన మృతదేహానికి పలువురు నాయకులు నివాళులర్పించారు.

అక్టోబర్ 1న టెన్నిస్ పోటీలు

గిద్దలూరు రూరల్: పట్టణంలోని టెన్నిస్ కోర్టు ఆవరణలో అండర్-14, అండర్-17 బాలబాలికలకు అక్టోబర్ 1వ తేదీన టెన్నిస్ పోటీలు నిర్వహించనున్నట్లు స్కూల్ గేమ్స్ నియోజకవర్గ కోఆర్డినేటర్ గుర్రం శోభన్‌బాబు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పోటీల్లో పాల్గొనే వారు అడ్మిషన్ నెంబర్, పెన్ నంబర్, పుట్టిన తేదీ వివరాలతో కూడిన పత్రంపై ప్రధానోపాధ్యాయుడితో సంతకం చేయించుకుని, ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచించారు.

‘కిట్స్’లో డెవోప్స్‌పై వర్క్‌షాప్

మార్కాపురం టౌన్: స్థానిక కిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో కంప్యూటర్ సైన్స్, ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ అండ్ మిషన్ లెర్నింగ్‌పై తృతీయ సంవత్సరం విద్యార్థులకు వారంరోజులపాటు డెవోప్స్ వర్క్‌షాపు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ వెన్న కృష్ణారెడ్డి ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సాఫ్ట్‌వేర్ ఉద్యోగం పొందేందుకు అవసరమైన నైపుణ్యాన్ని విద్యార్థులకు నేర్పించనున్నట్లు తెలిపారు. రిసోర్స్ పర్సన్లుగా పి.గగన్ కుమార్, సీహెచ్ తేజ, రామకుమార్ వ్యవహరించారు. కార్యక్రమంలో సీఎస్ఈ హెచ్ఓడీ జేవీ అనీల్‌కుమార్, అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

పండుగలతో హిందువుల ఐక్యత


వినాయక మండపాల నిర్వాహకులను సన్మానిస్తున్న విశ్వహిందూ పరిషత్ సభ్యులు


కార్యక్రమంలో పాల్గొన్న మండపాల నిర్వాహకులు

- విశ్వహిందూ పరిషత్ సభ్యుడు యక్కలి రాఘవులు

ఒంగోలు మెట్రో: సమాజంలో హిందూ ధార్మిక శక్తిని, ఐక్యతను చాటడానికి పండుగలు ఎంతో ఉపయుక్తంగా ఉన్నాయని విశ్వహిందూ పరిషత్ సభ్యుడు యక్కలి రాఘవులు అన్నారు. స్థానిక అంజయ్య రోడ్డులోని ఆంధ్రకేసరి విద్యా కేంద్రంలో విశ్వహిందూ పరిషత్ అనుబంధశాఖ అయిన ఒంగోలు గణేష్ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన వినాయక మండప నిర్వాహకుల అభినందన సభకు ఆయన ముఖ్య అతిథి హాజరయ్యారు. విశ్వహిందూ పరిషత్ జిల్లా అధ్యక్షుడు తూనుకుంట మల్లికార్జునరావు అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో రాఘవులు మాట్లాడుతూ స్వాతంత్ర్య ఉద్యమంలో భారతీయులంతా ఒకటిగా నిలబడటానికి బాలగంగాధర్ తిలక్ వినాయకచవితి పండుగ నిర్వహించేవారని తెలిపారు. నగరంలోని పలు డివిజన్ల నుంచి 80కిపైగా గణేష్ మండపాల నిర్వాహకులు మొత్తం 300 మంది పాల్గొనగా, విశ్వహిందూ పరిషత్ గణేష్ ఉత్సవ సమితి, ఇందిరా ప్రియదర్శిని లా కళాశాల వారు ఘనంగా సత్కరించారు. భవిష్యత్తులో గణేష్ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో పటిష్టమైన హిందూ ధార్మిక శక్తిని బలోపేతం చేస్తూ వినాయక మండపాల నిర్వహణకు కావాల్సిన అన్ని రకాల అనుమతులు ఒక పద్ధతిలో జరిగేలా చూస్తామని గణేష్ ఉత్సవ సమితి అధ్యక్షుడు, విశ్వహిందూ పరిషత్ ప్రాంత సత్సంగ్ ప్రముఖ్ సోమ సుబ్బారావు తెలిపారు. కార్యక్రమంలో ఇందిరా ప్రియదర్శిని లా కళాశాల ప్రతినిధులు శిఖాకొల్లి సాంబశివరావు, వీహెచ్‌పీ జిల్లా కార్యదర్శి ఇనమనమెళ్లూరి సీతారామయ్య, సహకార్యదర్శి ఈమని బలరాం, వ్యామిజాల ప్రసన్నకుమార్‌శర్మ, కోశాధికారి సాధు శ్రీనివాసగుప్తా, భైరవేశ్వరానందస్వామి, పసుమర్తి వెంకటేశ్వర్లు, జిల్లెలమూడి వెంకటేశ్వర్లు, నేరెళ్ల శ్రీనివాసులు, సుంకు రఘు, ప్రచార ప్రముఖ్ రాధా రమణ గుప్తా జంధ్యం, మద్దు అరవిందలక్ష్మి, చీమకుర్తి శివప్రసాద్, పి.శ్రీనివాసరావు, ఈదుల కృష్ణ తదితరులు పాల్గొని కార్యనిర్వహణ చేశారు.

సర్వమానవ సంక్షేమం కోసం..

- భద్రాద్రి నుంచి తిరుపతికి పాదయాత్ర
- మద్దిపాడు చేరుకున్న సందర్భంగా వివరాలు వెల్లడించిన నానమ్మ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ వీరేంద్రచౌదరి


పాదయాత్ర చేస్తున్న వీరేంద్రచౌదరి, తదితరులు

మద్దిపాడు: సర్వమానవ సంక్షేమం కోసం భద్రాద్రి నుంచి తిరుపతికి పాదయాత్ర నిర్వహిస్తున్నట్లు నానమ్మ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, త్రివేణి ఎడ్యుకేషనల్ సొసైటీ డైరెక్టర్ డాక్టర్ గొల్లపూడి వీరేంద్రచౌదరి తెలిపారు. ఆయనతో పాటు సొసైటీ సభ్యులు భద్రాద్రి శ్రీరాముని దగ్గరి నుంచి తిరుపతి వెంకటేశ్వరస్వామి వరకూ చేపట్టిన పాదయాత్ర ఆదివారం మద్దిపాడు చేరుకుంది. ఈ సందర్భంగా పాదయాత్ర వివరాలను వీరేంద్రచౌదరి వివరించారు. తన స్వగ్రామమైన మద్దిపాడు మండలంలోని తెల్లబాడు, దొడ్డవరం గ్రామాలకు కూడా తాను పలు రకాల సేవలు అందించినట్లు తెలిపారు. ప్రస్తుతం త్రివేణి కృష్ణవేణి విద్యాసంస్థలను కొత్తగూడెం, ఖమ్మం, హైదరాబాద్‌లో నిర్వహిస్తూ ఈ నెల 19వ తేదీ భద్రాద్రి నుంచి పాదయాత్ర ప్రారంభించినట్లు చెప్పారు. 11 రోజులుగా పాదయాత్ర చేస్తున్నామన్నారు. 2004 నుంచి ప్రతి లీప్ సంవత్సరం ఈ విధంగా పాదయాత్ర చేస్తున్నట్లు తెలిపారు. మిగిలిన సంవత్సరాలలో భద్రాచలం నుంచి ద్వారకా తిరుమలకు పాదయాత్ర చేస్తుంటామన్నారు. ప్రస్తుతం 7వ సారి పాదయాత్ర చేస్తున్న సందర్భంగా అక్టోబర్ 7వ తేదీ నాటికి తిరుపతి చేరుకుని తమ విద్యాసంస్థల తరఫున స్వామివారి నిత్యాన్నదాన ట్రస్టుకు రూ.10 లక్షలు అందించనున్నట్లు తెలిపారు. సుమారు 619 కిలోమీటర్లు పాదయాత్ర సాగించి స్వామివారి బ్రహ్మోత్సవాల సమయానికి తిరుపతి చేరుకునే విధంగా ప్రయాణం సాగిస్తున్నామన్నారు. ఆయన వెంట యార్లగడ్డ వెంకటేశ్వరరావు, కాట్రగడ్డ మురళీకృష్ణ, రామకృష్ణ, రవికిరణ్‌చారి, సనత్‌కుమార్, సురేష్ బాబు, శ్రీనివాస్, రమేష్, రాఘవులు తదితరులు పాల్గొన్నారు.

సాఫ్ట్‌బాల్ జిల్లా జట్ల ఎంపిక


బాలికల జట్టు

ఒంగోలు: సాఫ్ట్‌బాల్ అండర్-19 బాలబాలికల జిల్లా జట్లను శనివారం స్థానిక ఏబీయం కాలేజీ ఆవరణలో ఎంపిక చేశారు. ఈ సందర్భంగా స్కూల్ గేమ్స్ జిల్లా కార్యదర్శి ఈదర చింపారెడ్డి, ఒలింపిక్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి బొడ్డు సుబ్బారావు మాట్లాడుతూ రాష్ట్రస్థాయి పోటీల్లో కూడా విజేతగా నిలిచి జిల్లా కీర్తి ప్రతిష్టలు పెంచాలన్నారు. క్రీడల్లో రాణించడం ద్వారా ఉన్నత అవకాశాలను సులువుగా పొందడం సాధ్యపడుతుందని తెలిపారు. ఆరోగ్యపరంగా కూడా ఆనందంగా ఉండగలుగుతారన్నారు. ఎంపికైన బాలబాలికల జట్లు అక్టోబరు 2 నుంచి 4వ తేదీ వరకు పశ్చిమ గోదావరి జిల్లా పెద్దవేగిలో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనాల్సి ఉంటుందన్నారు.

బాలుర జట్టు : పి.వాసుదేవరాజ్, జె.రుత్విక్, ఎస్‌కే రసూల్, పి.పవన్‌కళ్యాణ్, ఎస్.హర్షవర్ధన్, సీహెచ్ కార్తీక్, డి.గురుతేజ, పి.హరినాగసాయి, ఎ.ప్రణయ్, ఎ.అక్షిత్, కె.నరసింహ, జి.దుర్గారెడ్డి, ఎస్.దిలీప్‌రెడ్డి, పి.చరణ్, ఎం.మహేష్‌బాబు.

బాలికల జట్టు : పి.నందిని, ఎస్.సాయిప్రదీప్, ఎస్‌కే సాధియ, కె.మానస, కె.శ్రీవల్లి, డి.మాధురి, కె.భవ్యశ్రీ, సీహెచ్ దక్షిత, ఎస్.హర్షిణి, లిప్సిక, పి.లోకేశ్వరి, కె.నిహారిక, ఎం.ప్రణవి, బి.కారుణ్య.


బాలుర జట్టు

ఆరిస్టాటిల్ కుటుంబానికి ఆర్థికసాయం


ఆర్థికసాయం అందిస్తున్న దళిత నాయకులు

ఒంగోలు టౌన్: ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక సభకు వచ్చి తిరుగు ప్రయాణంలో ప్రమాదవశాత్తూ మరణించిన ఆరిస్టాటిల్ కుటుంబానికి ఆర్థిక సాయాన్ని దళిత నాయకుడు నీలం నాగేంద్రరావు అందజేశారు. ఆదివారం దళిత నాయకులతో కలిసి కందుకూరు వెళ్లి ఆరిస్టాటిల్ తల్లి కల్పనకు రూ.25 వేల నగదు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కందుకూరులోని శ్రీనగర్ కాలనీకి చెందిన ఆరిస్టాటిల్ దళిత ఉద్యమాలలో క్రియాశీలకంగా పాల్గొంటూ ప్రమాదవశాత్తూ మరణించడం బాధాకరమన్నారు. కార్యక్రమంలో మాల మహానాడు అధ్యక్షుడు దారా అంజయ్య, సామాజికవేత్త పాలేటి కోటేశ్వరరావు, కసుకుర్తి ఆమెన్ రాజు, కాకుమాని, మక్కెన వరకుమార్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో సామూహిక సాయిలీలామృత పారాయణం


పారాయణంలో పాల్గొన్న మహిళలు

ఒంగోలు మెట్రో: స్థానిక లాయర్‌పేట షిరిడీ సాయి బాబా మందిరంలో సాయి మహా సమాధి, బాబా పుణ్యతిథి, దేవీశరన్నవరాత్రులలో భాగంగా షిరిడీ సాయి కల్చరల్ మిషన్ ఆధ్వర్యంలో ఆదివారం 200 మంది మహిళా భక్తులు పాల్గొని ఎక్కిరాల భరద్వాజ మాస్టారు రచించిన సాయిలీలామృతాన్ని భక్తిశ్రద్ధలతో పారాయణం నిర్వహించారు. అనంతరం కార్యక్రమంలో పాల్గొన్న మహిళా భక్తులు సాయిబాబా ఆశీస్సులు అందుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

రంగురంగుల బొమ్మలతో ప్రతిభ చూపిన చిన్నారులు


కార్యక్రమంలో బొమ్మలు వేసిన చిన్నారులు

ఒంగోలు టౌన్: చిన్నారుల్లోని సృజనాత్మకతను వెలికితీసేందుకు ప్రతి ఆదివారం చదవడం మాకిష్టం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా గ్రంథాలయ ఉప పాలకురాలు బొమ్మల కోటేశ్వరి తెలిపారు.దాదివారం ఉదయం 10 నుంచి 12 గంటల వరకు పిల్లలతో కథల పుస్తకాలు చదివించారు. పిల్లలకు జాతీయ నాయకుల జీవిత చరిత్రలు చదివి వినిపించారు. అనంతరం నిర్వహించిన డ్రాయింగ్ పోటీల్లో చిన్నారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఒకరు మువ్వన్నెల జాతీయ పతాకాన్ని ముచ్చటగా చిత్రీకరిస్తే, మరొకరు త్రినేత్రుడి చిత్రాన్ని తీరిగ్గా గీశారు. చిన్నారులు వేసిన రంగురంగుల బొమ్మలు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా కోటేశ్వరి మాట్లాడుతూ చక్కటి చిత్రాలు వేసిన చిన్నారులకు వచ్చే ఆదివారం నిర్వహించే చదవడం మాకిష్టం కార్యక్రమంలో బహుమతులివ్వడం జరుగుతుందన్నారు. చిన్నారులు దసరా సెలవులను వృథా చేసుకోకుండా గ్రంథాలయానికి వచ్చి పుస్తకాలు చదవడం అలవాటు చేసుకోవాలని సూచించారు. పుస్తకాలు చదవడం వలన మంచి వ్యక్తిత్వం వస్తుందని చెప్పారు. కార్యక్రమంలో బహుజన కవి జాలాది మోహన్, సిబ్బంది సంపూర్ణమ్మ, ఇమ్మానియేలు, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

ఆటోను ఢీకొట్టిన ట్రాక్టర్

- తెగిపోయిన 12ఏళ్ల బాలుడి కాలు


ప్రమాదాలకు గురైన ఆటో, ట్రాక్టర్


తెగిపోయిన అశోక్‌చక్రవర్తి కాలు

గుడ్లూరు (కందుకూరు రూరల్): ఆటోను ఎదురుగా వస్తున్న ట్రాక్టర్ ఢీకొట్టడంలో బాలుడికి తీవ్ర గాయాలైన సంఘటన మండలంలోని గుడ్లూరు-అడవి రాజుపాలెం గ్రామాల మధ్య ఆదివారం రాత్రి జరిగింది. వివరాల ప్రకారం.. అడవిరాజుపాలెం గ్రామానికి చెందిన గొడపేరు పీటర్, శారమ్మ తమ కుమారుడు అశోక్ చక్రవర్తితో కలిసి అదే గ్రామానికి చెందిన ఆటోను అద్దెకు మాట్లాడుకొని రామాయపట్నం వెళ్లారు. తిరిగు ప్రయాణంలో గుడ్లూరు మీదుగా అడవి రాజుపాలెం వస్తున్నారు. గుడ్లూరుకు చెందిన ట్రాక్టర్ అడవి రాజుపాలెం పొలాల్లో సేద్యం చేసి తిరిగి గుడ్లూరు వస్తోంది. గుడ్లూరు, అడవి రాజుపాలెం గ్రామాల మధ్య ఎలికేరు వాగు వద్దకు రాగానే ఎదురుగా వస్తున్న ట్రాక్టర్.. ఆటోని ఢీకొట్టింది. ట్రాక్టర్ గొర్రు ఆటోకి తగులుకుని ఆటోని ఈడ్చుకెళ్లింది. దీంతో ఆటోలో ఉన్న అశోక్ చక్రవర్తి (12) కాలు పూర్తిగా తెగిపోయింది. తల్లిదండ్రులైన పీటర్, శారమ్మలకు స్వల్పగాయాలయ్యాయి. 108 వాహనంలో కందుకూరు వైద్యశాలకు తరలించగా అక్కడ నుంచి ఒంగోలు తరలించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఆటో, ట్రాక్టర్‌ను పోలీస్ స్టేషన్‌కు తీసుకొచ్చారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేస్తామని ఎస్సై వెంకట్రావు తెలిపారు.

ఎస్‌జీఎఫ్ క్రీడా జట్ల ఎంపిక


అండర్-17కు ఎంపికైన క్రీడాకారులు


అండర్-19కు ఎంపికైన క్రీడాకారులు

ఒంగోలు: స్థానిక భారత జాతీయ వ్యాయామ కళాశాలలో ఆదివారం స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) అండర్-17, అండర్-19 పవర్‌లిఫ్టింగ్, వెయిట్‌లిఫ్టింగ్ బాలబాలికల జట్లను ఎంపిక చేశారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా క్రీడాకారులు హాజరయ్యారు. ముందుగా క్రీడాకారులకు పోటీలు నిర్వహించి విజేతలను జిల్లా జట్లకు ఎంపిక చేశారు. ఎంపికైన వారు త్వరలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లా తరఫున పాల్గొంటారని చెప్పారు. ఈ ఎంపిక ప్రక్రియకు ముఖ్యఅతిథిగా రవాణాశాఖ ఉప కమిషనర్ ఆర్.సుశీల, జిల్లా క్రీడాభివృద్ధి శాఖాధికారి జి.రాజరాజేశ్వరి, ఎస్‌జీఎఫ్ అండర్-17 కార్యదర్శి కె.వనజ, ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు కుర్రా భాస్కరరావు, జిల్లా కార్యదర్శి జి.భక్తధృవుడు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమిలో ఆక్రమణల తొలగింపు


భూమిని స్వాధీనం చేసుకుంటున్న అధికారులు

పొదిలి: ఒంగోలు-నంద్యాల రోడ్డులో కాటూరివారి పాలెం సమీపంలో రోడ్డు పక్కనే ఆక్రమణకు గురైన ప్రభుత్వ భూమిని రెవెన్యూ అధికారులు ఆదివారం స్వాధీనం చేసుకున్నారు. ఆక్రమణదారునిపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. పొదిలి రెవెన్యూ పరిధిలోని వివిధ సర్వే నంబర్లలో 22.81 ఎకరాల అసైన్ భూమి ఉంది. ఈ భూమిని ఓ కుటుంబం గత 20 సంవత్సరాలుగా అనుభవిస్తోంది. దీనిపై రెవెన్యూ అధికారులు హైకోర్టును ఆశ్రయించారు. రెవెన్యూ శాఖకు అనుకూలంగా కోర్టు తీర్పు ఇచ్చింది. ఈ నేపథ్యంలో కనిగిరి ఆర్డీఓ పి.జాన్ ఇర్విన్ ఆధ్వర్యంలో ఆదివారం ఆక్రమణలను తొలగించారు. తహసీల్దార్ ఎంవి.కృష్ణారెడ్డి, ఇన్‌చార్జ్ ఆర్ఐ కె.సుబ్బారావు, మండల సర్వేయర్, వీఆర్‌ఓలు ఉన్నారు.

అపరిశుభ్రంగా మినీ వాటర్ ట్యాంకులు


పాలకవీడులో పాచితో నిండిపోయిన మినీ వాటర్ ట్యాంకు


అనుమలవీడులో పైపు పగిలిపోయిన వాటర్ ట్యాంకు


సచివాలయం సమీపంలో కుళాయి లేకపోవడంతో వృథాగా పోతున్న నీరు

- పాచితో నిండిపోయినా పట్టించుకోని అధికారులు

రాచర్ల: మండలంలోని పాలకవీడు పంచాయతీ పరిధిలోని అనుమలవీడు, పాలకవీడు గ్రామాల్లో మినీ వాటార్ ట్యాంకులు శుభ్రం చేయకపోవడంతో పాచితో నిండిపోయి దుర్వాసన వస్తున్నాయి. పాలకవీడు గ్రామంలో దర్గా వద్ద మినీ వాటర్ ట్యాంకు లోపలి భాగంతో పాటు బయట కూడా పాచి పట్టింది. అనుమలవీడు గ్రామంలోని శివాలయం సమీపంలో ఉన్న వాటర్ ట్యాంకుకు నీటిని సరఫరా చేసే పైపులైను పగిలిపోయి నెలలు గడుస్తున్నప్పటికీ సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదు. అనుమలవీడు సచివాలయం సమీపంలోని వాటర్ ట్యాంకుకు కుళాయి అమర్చకపోవడంతో ట్యాంకులోని నీరంతా వృథాగా పోతోంది. ప్రస్తుతం సచివాలయం పంచాయతీ కార్యదర్శి రమణ దీర్ఘకాలిక సెలవులో వెళ్లిపోవడంతో యడవల్లి పంచాయతీ కార్యదర్శి సురేష్‌కు ఇన్‌చార్జిగా బాధ్యతలు అప్పగించారు. ఆయన చుట్టం చూపుగా వచ్చి సచివాలయాన్ని సందర్శించి వెళ్లిపోతున్నారే తప్ప సమస్యలను పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి మినీ వాటర్ ట్యాంకులను శుభ్రం చేయించి, కుళాయిలు సక్రమంగా ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

విద్యార్థుల ఉన్నత భవితే ‘వివేకానంద’ లక్ష్యం


తల్లిదండ్రులను సత్కరిస్తున్న వైవీ, కేవీ

పొదిలి: విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహించడమే లక్ష్యంగా శ్రీ వివేకానంద విద్యా సంస్థలు కృషి చేస్తున్నట్లు డైరెక్టర్లు వై.వెంకటేశ్వరరావు, కేవీ రమణారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం స్థానిక శ్రీవివేకానంద జూనియర్ కళాశాలలో తల్లిదండ్రుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కేవీ, వైవీ మాట్లాడుతూ.. విద్యార్థుల ఉన్నతి కోసం యాజమాన్యం పాటుపడుతోందని, తల్లిదండ్రులు కూడా సలహాలు, సూచనలు ఇవ్వాలని కోరారు. కళాశాల అభివృద్ధికి సహకరిస్తున్న తల్లిదండ్రులకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ఇంటర్ ఫలితాల్లో రాష్ట్ర స్థాయిలో ఉత్తమ మార్కులు పొందిన విద్యార్థులను, వారి తల్లిదండ్రులను సత్కరించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, ప్రిన్సిపాల్, విద్యార్థులు పాల్గొన్నారు.